క్లుప్తంగా

వినుకొండలో అసిస్టెంట్ కలెక్టర్ పర్యటన



వినుకొండ(నూజెండ్ల): స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని పల్నాడు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కిరణ్‌కుమార్‌తో కలిసి స్పందనలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న రీ సర్వే పనులు, స్పందన అర్జీలను పరిశీలన చేసి సత్వరమే సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందికి, సర్వే సిబ్బందికి ఆమె పలు సూచనలు, సలహాలు చేశారు.

శంకరమఠంలో వేద మహాసభ



నరసరావుపేట ఈస్ట్: స్థానిక శృంగేరి శంకర మఠంలో గురువారం రాత్రి పులుపుల సత్యనారాయణ స్మారక విద్యాపీఠం 39వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వేద మహాసభ నిర్వహించారు. వేద మహాసభలో కుప్పా రామగోపాల సోమయాజులు, దుర్భాకుల గురునాథ ఘనపాఠి, వంగల కృష్ణమూర్తి అవధాని పర్యవేక్షణలో వేద పండితులు సంపూర్ణ కృష్ణ యజుర్వేద పారాయణం గావించారు. ఈ సందర్భంగా విష్ణుభట్ల నాగవేంకట లక్ష్మీనారాయణ ఘనపాఠిని స్వాధ్యాయ చతురానన బిరుదుతో సత్కరించారు. కార్యక్రమంలో విద్యాపీఠం గౌరవాధ్యక్షుడు డాక్టర్ తెలికేపల్లి లక్ష్మీనారాయణశాస్త్రీ, అధ్యక్షుడు పులుపుల సతీష్, వేద పండితులు సాగి ఆంజనేయశాస్త్రి, కుప్పా శివసుబ్రమణ్య అవధాని, వేదాంతం శ్రీరామకృష్ణ శ్రీశ తదితరులు పాల్గొన్నారు.

ఓటు చేర్పులు, మార్పులపై 4,5 తేదీల్లో ప్రత్యేక డ్రైవ్‌లు

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఈ నెల 4,5 తేదీల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు ప్రజలకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండాలన్నారు. ఓటు హక్కు పొందుటకు ఫారం-6, తొలగింపులకు ఫారం-7, మార్పులు, చేర్పులకు ఫారం-8లపై ప్రజలకు అవగాహన కల్పించి వారి వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. అందుబాటులో లేని బూత్ లెవల్ అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

రేపు అన్నవరంలో గడప గడపకు మన ప్రభుత్వం

రొంపిచర్ల : మండలంలోని అన్నవరం గ్రామంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైస్సార్‌సీపీ మండల నాయకులు పచ్చవ రవీంద్రబాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొంటారన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో గ్రామంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా సామాజిక పెన్షన్లు, రేషన్ కార్డులు, జగనన్న కాలనీలు, అర్హులకు ఇంటి స్థలాలుతో పాటు అన్ని సంక్షేమ పథకాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. గ్రామంలో ఇప్పటి వరకు వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధి ప్రజలకు వివరించి జరగబోయే అభివృద్ధి గామానికి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం దోహదపడుతుందని రవీంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ అభివృద్ధికి అవసరమైన నిర్దిష్ట ప్రణాళిక కూడా తయారు చేయటం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ మెంబర్లు, సొసైటీ అధ్యక్షులు, వార్డు మెంబర్లు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

యువకుడికి తప్పిన ప్రమాదం

నాదెండ్ల: జాతీయ రహదారిపై యువకుడికి ప్రాణాపాయం తప్పింది. చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపునకు ద్విచక్ర వాహనంపై యువకుడు వెళ్తున్నాడు. గణపవరం శివప్రియనగర్ సమీపంలో రహదారి మరమ్మతుల్లో భాగంగా రాళ్ళు రోడ్డుపై పడటంతో ద్విచక్ర వాహనం రాయిపైకి ఎక్కి వాహనం అదుపు తప్పింది. దీంతో యువకుడు రోడ్డుపై పడ్డాడు. అదే సమయంలో వెనుక నుంచి నంబరు గల కారు వేగంగా వస్తున్న సమయంలో, యువకుడు రోడ్డుపై పడటంతో కారు డ్రైవర్ అప్రమత్తపై సడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో ప్రమాదం తప్పింది. స్వల్పగాయాలపాలైన యువకుడిని ఆసుపత్రికి తరలించారు. రహదారి మరమ్మతుల సమయంలో ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం: ప్రజాసమస్యలు పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు కీలకపాత్ర పోషించాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సూచించారు. గురువారం రాత్రి మండలంలోని బొందిపాలెం గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్ చింతా విజయ్‌కుమార్ (అంకమ్మ) ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం అడవి పేరంటాళ్లమ్మ అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ సీఎంవై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో గ్రామాల్లో అభివృద్ధి పనులతో పాటు అర్హత ఉన్న పేదలందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. బొందిలిపాలెంలో గత టీడీపీ ప్రభుత్వం చేయనటువంటి అభివృద్ధి పనులు తాము చేశామన్నారు. గ్రామంలో దీర్ఘకాలంగా ఉన్న ప్రధాన కూడలి మార్గంలో సీసీ డ్రైన్స్ రూ.8 లక్షల వ్యయంతో నిర్మాణాలు చేశామన్నారు. అలాగే అడవి పేరంటాలమ్మ దేవాలయం వెళ్లే రహదారి మార్గంలో రూ. 20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు వేశామన్నారు. ఇటీవల గ్రామంలో ఏడు చేతిపంపులు వేసి తాగునీటి సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపట్టామన్నారు. అనంతరం నూతన సర్పంచ్ చింతా విజయ్‌కుమార్‌ను పూలమాలలు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. మహిళలు ఏర్పాటు చేసిన కోలాటం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తిలకించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కన్వీనర్ భీమని అంకారావు, అడవి పేరంటాళ్ళమ్మ దేవాలయం చైర్మన్ సోమేపల్లి అంజయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు బోడాల వీరాంజనేయులు, అల్లూరి వెంకట్రావు, పాపసాని బ్రహ్మయ్య, కుంచాల శ్రీనివాసరావు, అల్లూరి వెంకయ్య, వైస్ ఎంపీపీ చెన్నంశెట్టి రంగారావు, వివిధ గ్రామాల సర్పంచులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

7న వినుకొండలో సామాజిక బస్సుయాత్ర

విజయవంతం చేయాలంటూ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): వినుకొండలో ఈనెల 7వ తేదీ జరిగే సామాజిక బస్సుయాత్ర విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సామాజిక పరంగా ఎస్టీ ఎస్సీ, బీసీలకు, చట్టసభలతోపాటు, స్థానిక సంస్థల్లో అనేక మందికి అవకాశం కల్పించినట్లు చెప్పారు. అలాగే వినుకొండ నియోజకవర్గంలో ఒక ఎస్టీ మహిళకు మార్కెట్ యార్డు చైర్మన్ పదవితోపాటు, మున్సిపల్ వైస్ చైర్మన్, జెడ్పీ కో ఆప్షన్ పదవి, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు స్థానిక కమిటీలల్లో అవకాశం కల్పించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి ఎస్టీ, ఎస్సీ, బీసీలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా సమీకరణ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, వార్డు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో అన్నదాన కార్యక్రమం



వినుకొండ(నూజెండ్ల): విశ్రాంతి ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని సంఘం భవనం ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా సంఘం తరపున పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు సుబ్బయ్య శర్మ, అప్పరాజు రామలింగేశ్వరరావు, అవ్వారు కోటేశ్వరరావు, శేషయ్య, బీపీఎస్ సుందరరావు, పుట్టంరాజు నారాయణరావు, ఎం.వి.శర్మ, సీహెచ్. సుబ్బారావు, ఆదిరాములు, దీక్షితు లు, కృష్ణమూర్తి, రాఘవయ్య, రాము తదితరులు పాల్గొన్నారు

జాబితాలో సవరణలు జాగ్రత్తగా చేపట్టాలి

–ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి



రొంపిచర్ల : ఓటర్ల జాబిత సవరణలలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్త వహించాలని ఆర్డీవో ఎం. శేషిరెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఓటర్ల జాబిత సవరణలపై బీఎల్‌వోలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో ఎం.శేషిరెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి గుర్తించి వారి ఇళ్లకు వెళ్ళి కుటుంబ సభ్యుల సహకారంతో తొలగించాలని అన్నా రు. అదే విధంగా ఓటర్ల జాబితాలో పేర్లు సవరణలు, అడ్రస్ మార్పులపై ధరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలు పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. అవతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.అంకారావు, డిప్యూటీ తహసీల్దార్ బాల వెంకటేశ్వర్లు, ఆర్ ఐ సుబ్బారావు, సీనియర్ అసిస్టెంట్ మాదిరాజు చంద్రశేఖర్, వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

అనుమానాదస్పద స్థితిలో వ్యక్తి మృతి

నకరికల్లు: అనుమానాదస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. వీఆర్వో చింతిరాజ్ యువరాజ్ ఫిర్యాదు మేరకు చల్లగుండ్ల అడ్డరోడ్డులోని అభయాంజనేయ స్వామి దేవస్థానం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతుని పక్కన టీఎస్05 ఎస్ఎన్ 3156 నంబరు బజాజ్ ప్లాటినా ద్విచక్ర వాహనంతోపాటు బ్యాగు ఉందన్నారు. అతని పర్సు, వాహనం సీ బుక్ ఆధారంగా మృతుడు రూపాని రాజు (38)గా గుర్తించినట్లు వెల్లడించారు. మృతుడు నల్గొండ జిల్లా భీమవరం గ్రామానికి చెందిన వ్యక్తిగా ఆధారాలు లభించాయన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాతులూరులో స్వాములకు నిత్య సద్ది



సాతులూరు రెడ్డి పేరంటాలమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

నాదెండ్ల: సాతులూరు రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయం వద్ద స్వాములకు సద్ది కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ నెల 12వ తేదీ వరకూ 40 రోజులపాటూ దీక్ష చేపట్టిన అయ్యప్ప, శివ, భవాని మాలలు ధరించిన భక్తులకు అదే గ్రామానికి చెందిన జంపని లక్ష్మీనారాయణ వితరణ చేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు అయ్యప్పస్వామి పూజ, అభిషేక కార్యక్రమాలు జరుగుతాయని, అనంతరం సద్ది కార్యక్రమం ప్రారంభమౌతుందన్నారు. గత పదేళ్లుగా ఈ ఆలయం వద్ద పలువురు భక్తుల విరాళాలతో ఈ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు. ప్రతి రాత్రి సీతారాముల దేవాలయంలో మాలలు ధరించిన స్వాములకు బిక్ష ఏర్పాటు చేయనున్నట్లు అదేగ్రామానికి చెందిన బయ్యన వెంకట చలపతి, వెంకట శ్రీనివాసరావు, వెంకటగుప్త ఈ రెండు దేవాలయాల్లో 40 రోజుల పాటూ వితరణ చేయనున్నారు.

వాలీబాల్ పోటీల్లో లింగారావుపాలెం జట్టు సత్తా



విజేతలతో గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు

యడ్లపాడు: నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీల్లో లింగారావుపాలెం జెడ్పీహైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. చిలకలూరిపేట రోటరీక్లబ్ నిర్వహించిన లింగమనేని ఉమామహేశ్వరరావు స్మారక క్రీడోత్సవాల్లో పాఠశాల వాలీబాల్ బాలుర జట్టు అత్యుత్తమ ప్రతిభను చాటి, ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో విజేతలకు అభినందన సభను ఏర్పాటు చేశారు.

విజేతలతో పాటు వారికి తర్ఫీదు నిచ్చిన వ్యాయామోపాధ్యాయిని మేరిశౌరీని గ్రామపెద్దలు ఆలోకం పెద్దబ్బాయి, నంబూరు శివ రామ కృష్ణయ్య, తోకల సత్యనారాయణ, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు. పాఠశాల హెచ్ఎం కేవీ రామిరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి. శైలజ, డి.రామాంజనేయులు, పి.శ్రీనివాసరావు, కె. హేమలత, కె.రమాదేవి పాల్గొన్నారు.

'సీస్' పరీక్షకు 877 మంది విద్యార్థులు



పరీక్ష కేంద్రం పరిశీలిస్తున్న ఎంఈవో నూనె ప్రసాద్

నకరికల్లు: మండలంలో 3,6,9 తరగతి విద్యార్థులకు సీస్ పరీక్ష నిర్వహించినట్లు ఎంఈవో ఎన్. ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఆయా పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడో తరగతి చదువుతున్న విద్యార్థులు 14 పాఠశాలల్లో, ఆరో తరగతి విద్యార్థులకు 13 పాఠశాలల్లో, 9వ తరగతి విద్యార్థులకు 11 పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించగా, మొత్తం 877 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. విద్యావ్యవస్థ బలం, బలహీనత అంచనాతోపాటు లోపాలు గుర్తించడం, తరగతి గదిలో విద్యాభ్యాసనలో తోడ్పాటు, ఉపాధ్యాయులు వృత్తిపరమైన, అభ్యసన లక్ష్యాలను చేరుకోవడం తదితర ప్రయోజనాల దృష్ట్యా విద్యా శాఖ ఈ పరీక్ష నిర్వహిస్తోందన్నారు. పరీక్షల వల్ల విద్యార్థులు మరింతగా రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ బి.మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయండి



ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయాలని కరపత్రాలను చూపుతున్న సీపీఎం నాయకులు

అమరావతి: ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయాలని శుక్రవారం సీపీఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆర్టీసీ బస్టాండ్ సత్తెనపల్లి సెంటర్ ఆటోనగర్ ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు బస్సు జాతాలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఈ నెల 15న విజయవాడ నగరంలో ప్రజారక్షణ భేరి పేరుతో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ భారీ బహిరంగసభలో సీపీఎం జాతీయ కార్యదర్శి కామ్రేడ్ ఏచూరి సీతారాం, బి.వి.రాఘవులు తదితర నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని అన్నారు.
కలవరపరుస్తున్న దేశ ప్రజల ఆర్థిక స్థితులను, రాష్ట్ర విభజన హామీలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించిందీ.. ఈ సభలో విశ్లేషిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మొహిద్దీన్‌వలి నండూరి వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు

పేటలో రూ.70 వేల నగదు చోరీ

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీలోని ఓ ఇంట్లో రూ. 70 వేలు చోరీకి గురైంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కె సీత కుమారుడితో కలసి ఎన్‌టీఆర్ కాలనీలో నివాసం ఉంటోంది. గురువారం ఉదయం 9.30 గంటలకు వ్యక్తిగత పనిమీద విజయవాడకు వెళ్లింది. తిరిగి శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తలుపు పగలగొట్టి ఉండటం గమనించి, ఇంటిలోపల బీరువాలో ఉంచిన రూ. 70 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించింది. శనివారం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండలంలో కొద్దిపాటి వర్షపు జల్లులు

రొంపిచర్ల: మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం కొద్ది పాటి వర్షపు జల్లులు కురిసాయి. గత రెండు మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండటంతో రైతులు వర్షం కోసం ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. బెట్టకు వచ్చిన మెట్ట పైర్లకు ఈ సమయంలో వర్షం ఎంతో అవసరం ఉంది. అయితే గత రెండు రోజులుగా మండలంలో అక్కడక్కడ కొద్ది పాటి వర్షపు జల్లులు పడుతూనే ఉన్నాయి.

మిరపకు బెట్ట వాతావరణాన్ని దూరం చేయాలి

రైతులకు సూచించిన ఉద్యానశాఖాధికారి



రైతులకు సూచన చేస్తున్న నవీన్‌కుమార్

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు, అలవాల గ్రామాల్లో ఉద్యాన శాఖ అధికారి నవీన్ కుమార్ శుక్రవారం మిరప పొలాలను పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల వలన ఎక్కువ ప్రాంతంలో బెట్ట వాతావరణం నెలకొందన్నారు. మిరప పంట బెట్ట వాతావరణాన్ని అధిగమించేందుకు ఫ్యూమిక్ యాసిడ్ వాడాలని సూచించారు. యాసిడ్ అందుబాటులో లేని పక్షంలో 14.035 స్ప్రే పొటాష్, 19.19.19 లలో ఏదో ఒకదానిని లీటర్ నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. డిప్ పద్ధతి ద్వారా నీటియాజమాన్య పద్ధతులను చేపటితే ఎక్కువ నీటిని ఆదా చేసుకోవచ్చొన్నారు. నీటి ద్వారా సంక్రమించే తెగుళ్లను కూడా అధికమించవచ్చు అని సూచించారు. కలుపు ప్రభావం కూడా తక్కువగా ఉంటుందన్నారు. ప్రస్తుత తరుణంలో పంటలు అన్ని ఇబ్బందులు లేకుండా ఉన్నాయని, కనీస జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులను సాధించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. విజయభాస్కర్, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పి. అగస్టీన్, ఎస్. రమేష్, టి. కళ్యాణ్‌బాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

నేడు రేపు ఓటరు జాబితాపై స్పెషల్ డ్రైవ్



తహసీల్దార్ కుటుంబరావు

యడ్లపాడు: మండలం పరిధిలో నవంబర్ 4, 5 తేదీల్లో అలాగే డిసెంబరు నెల 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఏఈఆర్‌వో, తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు తెలిపారు. నూతనంగా సవరించిన ఓటరుజాబితా ప్రకారంగా యడ్లపాడు మండలంలో మొత్తం 43,377 మంది ఓటర్లు ఉండగ, వాటిలో పురుషులు 20,921 మంది, మహిళలు 22,456 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మండలంలోని 58 నుంచి 114 వరకు ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించిన అనంతరం ఓటర్ల జాబితాల్లో చేర్పులు, మార్పులకు మళ్లీ అవకాశం కల్పిస్తారని తెలిపారు. జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేసే అవకాశం ఉందన్నారు. యువతీ యువకులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లలో ఆధార్ కార్డు, పాస్‌పోర్టు ఫోటో, పదో తరగతి ధ్రువపత్రాలతో ఓటరు నమోదు కోసం దరఖాస్తులు సమర్పించుకోవచ్చన్నారు. స్పెషల్ క్యాంపుల్లోనే జాబితాలను పరిశీలించుకుని పేర్లు లేకుంటే మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతరత్రా మార్పులు, చేర్పులు చేసుకునే వీలుంటుందని వెల్లడించారు. ఉదయం నుంచి తమ సమీప పోలింగ్ కేంద్రానికి వెళ్లి బీఎల్‌వోకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
ఓటర్ల జాబితాల్లో మార్పులు చేర్పుల అనంతరం తుది జాబితాలను రానున్న జనవరి 5న ప్రకటిస్తామని ఆమె పేర్కొన్నారు.

కనమర్లపూడిలో ప్రతిష్టకు సిద్ధమవుతున్న ఆలయాలు



పోలేరమ్మ దేవాలయం వద్ద ఏర్పాట్లు పర్యవేక్షణ చేస్తున్న గ్రామస్తులు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో నూతన దేవాలయాల ప్రతిష్ట కార్యక్రమాలకు రంగం సిద్ధం చేస్తున్నారు. సంగుపోట్ల హరినాథ్ శర్మ సారథ్యంలో ఈ నెల 7వ నుంచి 9వ తేదీ ప్రతిష్ట చేయనున్న గ్రామదేవతల పోలేరమ్మ, అద్దంకమ్మ, గంగమ్మ, పెద్దమ్మ, కనకమ్మ, మహాలక్ష్మమ్మ, నూతన దేవాలయాలు నిర్మాణ పనులు పార్టీలకు అతీతంగా గ్రామస్తులు దాతలు సహకారంతో తుదిదశకు చేరాయి. సుమారు రూ. 40 లక్షల వ్యయంతో ఈ నిర్మాణం చేపట్టారు. పొలాల్లో ఏర్పాటు చేసిన దేవాలయాలకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ పనులు పూర్తి చేశామన్నారు. పోలేరమ్మ దేవాలయం ప్రాంగణంలో ప్రతిష్ట వేడుకలకు సంబంధించి యజ్ఞశాల కూడా ఏర్పాటు చేశారు.

ఆహార పదార్థాలు సక్రమంగా అందించాలి

రాష్ట్రఫుడ్ కమిషన్ చైర్మన్ చిట్టా విజయప్రతాప్‌రెడ్డి



కస్తూర్బా పాఠశాలలో వంట గదిని పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి

ఈపూరు: ప్రతి అంగన్‌వాడీ కేంద్రం, ప్రతి పాఠశాలల్లో ప్రభుత్వం ద్వారా అందించే ఆహార పదార్థాలను సక్రమంగా అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిట్టా విజయ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండ్రముట్లలో రేషన్ దుకాణాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలలో మెనూను, వంట గదిని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం సక్రమంగా పెడుతున్నారా లేదా తదితర అంశాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే బొమ్మరాజుపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పోషకాహారం పంపిణీపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారన్నారు.

యడ్లపాడులో 22 పాఠశాలల్లో సామర్థ్య పరీక్షలు



యడ్లపాడులో విద్యార్థుల సామర్థ్య పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో అరుణకుమారి

యడ్లపాడు: జాతీయ విద్యాసాధన సర్వేలో భాగంగా విద్యార్థులకు సామర్థ్య పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. 3, 6, 9వ తరగతికి చెందిన వారికి తెలుగు, ఆంగ్లం, గణితంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్ష నిర్వహణను యడ్లపాడు ఎంఈవో-2 అరుణకుమారి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంల పర్యవేక్షించారు. బీఈడీ, ఇంజినీరింగ్ అభ్యసించే విద్యార్థులు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా వ్యవహరించారు. మండలం పరిధిలోని 22 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు హాజరైనట్లు ఎంఈవోలు అరుణకుమారి తెలిపారు.

విఘ్నేశ్వర, నంది విగ్రహాలకు కళాభికర్షణ



విఘ్నేశ్వర విగ్రహానికి కళాభికర్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మేకల హనుమంతరావు

అమరావతి: స్థానిక గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి ఆలయంలో విఘ్నేశ్వర, నంది విగ్రహాలకు స్థాన మార్పిడి చేసి పునఃప్రతిష్ట చేయటానికి శుక్రవారం కళాభికర్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు, వేద పండితులు పుణ్యాహవాచన, నవగ్రహ మండపారాధన, కళాభికర్షణ హోమం చేశా రు. అనంతరం ప్రస్తుత స్థానాల నుంచి కళాభికర్షణ చేసి విగ్రహాలను కదిలించారు.ఎంపీపీ మేకల హనుమంతరావు, డిప్యూటీ తహసీల్దార్ సునీత దేవాలయ ప్రతినిధి తాడిబోయిన శ్రీనివాసరావు, దేవాలయ ఈవో పూర్ణచంద్రరావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.